ప్రజాశక్తి
శనివారం 30 నవంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

మిర్చి ధరల తగ్గుముఖం

- గత సీజన్‌తో పోలిస్తే క్వింటాళ్‌కు రూ.4వేల తగ్గుదల
- రాయలసీమ నుంచి వస్తోన్న కొత్త సరుకు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో రాయలసీమ జిల్లాల నుంచి కొత్త సరుకు రావడం ప్రారంభమైంది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యశాయి, తెలంగాణలోని గద్వాల, కర్నాటక హుబ్లీ, బళ్లారి తదితర జిల్లాల నుంచి రోజుకు 10 నుంచి 20 వేల బస్తాల మిర్చి గుంటూరు యార్డుకు వస్తోంది. సరుకు ఎక్కువగా వస్తుండటంతో వ్యాపారులు ధరలను క్రమంగా తగ్గిస్తున్నారు. ధరల తగ్గుదల దాదాపు పక్షం రోజుల నుంచి కొనసాగుతోంది. గత మూడ్రోజుల్లో క్వింటాళ్‌కు రూ.3 నుంచి 4 వేల వరకు ధర తగ్గింది. ఎగుమతి అవకాశాలు తగ్గడం, వ్యాపారులు సిండికేట్ కావడం, కొత్త సరుకు తక్కువ ధరకు కొని నిల్వ చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే కోల్ట్ స్టోరేజీల్లో దాదాపు 25 లక్షల

వరకు నిల్వ ఉన్నట్టు చెబుతున్నారు.

ఈ ఏడాది పంట విస్తీర్ణం తగ్గడం వల్ల భవిష్యత్తులో ధరలు మరింత పెరుగుతాయని భావించి వ్యాపారులు ముందుగానే ధరలు తగ్గిస్తున్నారు. బంగ్లాదేశ్, చైనా,శ్రీలంక తదితర దేశాలకు జనవరి తరువాత ఎగుమతి అవకాశాలు వస్తే కానీ ధరలు పెరగవని అంటున్నారు. సుధూర ప్రాంతాల నుంచి గుంటూరు వరకు వెళ్లినా

2లో

తుపాను ప్రభావంతో చిరుజల్లులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలోని ఏర్పడిన వాయుగుండం తుపాను మారిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి చలిగాలులు తీవ్రమయ్యాయి. ఆకాశం మేఘావృతమై డెల్టాలోని కొన్ని ప్రాంతాల్లో జల్లులు ప్రారంభమయ్యాయి. కొల్లిపర మండలంలో శుక్రవారం సాయంత్రం జల్లులు పడటంతో రైతులు అప్రమత్తమయ్యారు. కోతలు పూర్తయ్యి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, బస్తాల్లో ఉంచిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. టార్పాలిన్ పట్టాలు తెచ్చుకుని పంటపై కప్పుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వర్షాలు శనివారం ప్రారంభం అవుతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే తుపాను ప్రభావం జిల్లాపై పెద్దగా ఉండకపోవచ్చని, మోస్తరుగా వర్షాలు పడే సూచనలున్నట్టు చెబుతున్నారు. దీంతో రైతులు కూడా వరి కోతలను కొద్ది రోజులు వాయిదా వేసుకుంటున్నారు. కోసిన తరువాత వర్షం వస్తే వరిపనలు తడిసి అధిక నష్టం వాటిల్లుతుందని, కోతలు రెండ్రోజులు వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. శీతాకాలం ప్రభావంతో పాటు తుపాను ప్రభావంతో చలిగాలులుతీవ్రం అయ్యాయి. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు చలి తీవ్రత కొనసాగుతోంది. చలి గాలుల ప్రభావంతో విద్యుత్ వినియోగం కొంత తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

కొల్లిపర మండలంలో ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో రైతులు

రిషితేశ్వరికి న్యాయం దక్కలేదు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-గుంటూరు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2015 జూలై 14వ తేదీన ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్య ఘటనలో న్యాయం జరగలేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అన్నారు. శుక్రవారం బ్రాడీపేటలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ర్యాగింగ్ వేధింపులు భరించలేక యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఉరేసుకుని చనిపోయిందని, సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్ అని, తనని సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని స్పష్టంగా రాసినట్లు గుర్తు చేశారు. ఈ కేసులో ముగ్గురు విద్యార్థులు, అప్పటి ఆర్కిటెక్చర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బాబురావు నిందితులుగా పేర్కొంటూ ఆమె తల్లిదండ్రులు కేసు పెట్టారన్నారు. తొమ్మిదేళ్ల నుండి ఈ కేసు నడుస్తోందని, ఈ కేసును కొట్టి వేస్తూ న్యాయస్థానం తీర్పునివ్వడం బాధాకరమన్నారు. రిషితేశ్వరి కేసులో నిందితులకు శిక్ష పడకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎస్కే సమీర్, నగర అధ్యక్షులు యశ్వంత్, సుభాని పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని విజయవాడలో

నేడు సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడ రాఘవయ్య పార్క్ సమీపంలోని బాలోత్సవ భవన్ (2వ అంతస్తు)లో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుంది. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఇతర వామపక్ష పార్టీల నాయకులు, మేధావులు పాల్గొంటారు.

ఉపాధ్యాయులకు ఆదర్శం కొమ్మారెడ్డి కేశవరెడ్డి

కేశవరెడ్డి సాహితీ పురస్కార సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయుడిగా, ఉద్యమ నాయకుడిగానే కాకుండా సాహితీవేత్తగా విశేష సేవలందించిన కొమ్మారెడ్డి కేశవరెడ్డి ఉపాధ్యాయులకు ఆదర్శమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాల్లోని విజ్ఞానంతోపాటు, సామాజిక అంశాలనూ అధ్యయనం చేయాలన్నారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కేశవరెడ్డి సాహిత్య పురస్కార సభ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి ఓల్గాకు కేశవరెడ్డి సాహితీ పురస్కారం-2024ను ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సాహితీవేత్తల ద్వారా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా

2లో

కేశవరెడ్డి జీవితంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఓల్గా, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితరులు

6, 7, 8 తేదీల్లో సిపిఎం పల్నాడు జిల్లా మహాసభ

జయప్రదం చేయాలని

జిల్లా కార్యదర్శి

గుంటూరు

విజయ్‌కుమార్ విజ్ఞప్తి

2లో

కృష్ణమ్మ ఇసుక తిన్నెలపై సైకత శిల్పం

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరం కృష్ణా నది ఇసుక తిన్నెల్లో అంతర్జాతీయ సైకత శిల్పి బాలాజీ వరప్రసాద్ సైతిక శిల్పం చెక్కారు. ఒరిస్సా ప్రభుత్వం నిర్వహించే శాండ్ ఆర్ట్ పోటీల్లో మూడేళ్ల నుండి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలాజీ వరప్రసాద్ ప్రథమ స్థానం సాధించి హ్యాట్రిక్ విజేతగా నిలిచారు. ఈసారి తమ విద్యార్దులను పోటీలకు పంపాలని నిర్ణయించుకొని ఎ.రోజా, వి.గోపీచంద్‌ను పంపిస్తున్నారు. సీతానగరం, తాడేపల్లిలోని కృష్ణా నదిలో శుక్రవారం 'సన్ రైసింగ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంతో సైకత శిల్పం చెక్కి విద్యార్థులకు శాండ్ ఆర్ట్‌పై అవగాహన కల్పించారు.

మిర్చి ధరల తగ్గుముఖం

(మొదటి పేజీ తరువాయి)

అదే ధర గ్రామాల్లోకూడా ఇదే ధర ఉంటుందని భావించేలా చేయడానికి ఇలా ధరలు తగ్గిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. తేమ శాతం అధికంగా ఉందని కూడా ధర కొంత తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గత ఏడాది ఇదే రోజుల్లో మిర్చి ధరలు గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.12 వేలు ఉండగా ఈ ఏడాది కొద్ది రోజులుగా సాధారణ రకాలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.7500 మాత్రమే పలికాయి. స్పెషల్ వెరైటీలు తేజ, బాడిగ, దేవనారు డీలక్స్ రకాలు కూడా గరిష్టంగా రూ.16,500, కనిష్టంగా రూ.7500 పలుకుతున్నాయి.

కోల్డ్‌స్టోరేజీలోని ఏసీలో నిల్వ చేసిన సాధారణ రకాలు కూడా దాదాపుగా ఇదే రీతిలో ధరలు పెరుగుతున్నాయి. కనిష్ట ధర రూ.7500, గరిష్ట ధర రూ.15 వేల వరకు ఈ వెరైటీలకు దక్కుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు యార్డుకు 72,17,130 టిక్కీల సరకు రాగా సగటు ధర రూ.16 వేలు దాటడం లేదు. గత నెల రోజుల కాలంలో దాదాపు 10 లక్షల టిక్కీలు యార్డుకు వచ్చాయి. అయితే గతేడాది నవంబరు నెలలో కేవలం 5.49 లక్షల టిక్కీలు మాత్రమే వచ్చాయని ఈఏడాది ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ సరుకు వచ్చిందని యార్డు అధికారులు తెలిపారు. గత నెల రోజుల కాలంలో సరుకు ఎక్కువ వచ్చిన రోజున ధరలు తగ్గించడం, సరుకు తక్కువగా వచ్చిన రోజు సగటు ధర స్వల్పంగా పెంచడం వ్యాపారులకు పరిపాటైంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు ఈ పరిస్థితి అత్యంత ఇబ్బంది కరంగా మారింది. సీజన్ ప్రారంభానికి ముందు గతేడాది కనిష్ట సగటు ధర రూ.9 వేలు, గరిష్ట సగటు ధర రూ.16 వేలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అయినకాడికి అమ్ముకుంటున్నారు. గుంటూరుకు సమీప ప్రాంతాల వారు మాత్రం ఒకటి రోజులు ఆరబెట్టుకుని యార్డులోనే నిద్రించి సరుకు అమ్మిన తరువాత సొంతూళ్లకు వెళ్తున్నారు.

ఖాళీలు భర్తీ చేసి ప్రమోషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని ఖాళీగా ఉన్న వి.ఆర్.ఓ పోస్టులు భర్తీ చేయాలని, అర్హులైన వి.ఆర్.ఏ లకు పదోన్నతులు ఇవ్వాలని ఏపి గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్. బందగీ సాహెబ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా రెవిన్యూ అధికారి మురళికి వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలకు తెలంగాణ మాదిరి పే స్కేల్ అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్ తదితర పోస్టులను వీఆర్‌ఏల చేత భర్తీ చేయాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని కోరారు. రెండు మండలాలలో వీఆర్‌ఏ వేతనాలకు సంబంధించి తహశీల్దార్ కార్యాలయ అధికారులు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. అక్రమ డ్యూటీలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రోశయ్య, రఫీ, రవి, మునాఫ్, రాజేష్ పాల్గొన్నారు.

6, 7, 8 తేదీల్లో సిపిఎం పల్నాడు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశ, రాష్ట్ర ప్రయోజనాలు, కార్మిక, కర్షక, బడుగు, బలహీన, అణగారిన వర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సిపిఎం నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 6, 7, 8 తేదీల్లో నరసరావుపేట పట్టణంలో ప్రకాష్ నగర్‌లోని షాదీఖానాలో సిపిఎం 25వ జిల్లా మహాసభ జరుగుతుందని, జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహాసభ ప్రారంభ సూచికగా 6వ తేదీన నరసరావుపేటలోని కోట సెంటర్ నుండి పల్నాడు బస్టాండ్ వరకు ప్రదర్శన అనంతరం పల్నాడు బస్టాండ్ వద్ద బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. సభకు ప్రధాన వక్తలుగా రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటి సభ్యులు వి.కృష్ణయ్య, హరికిషోర్ హాజరవుతారని తెలిపారు.

కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, అనాలోచిత నిర్ణయాలతో దేశానికి, రాష్ట్రానికి వాటిల్లే నష్టాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం చేపట్టాల్సిన పోరాటాలు, తీర్మానాలు, కార్యాచరణను ఈ సందర్భంగా రూపొందిస్తామన్నారు. దోపిడీ వర్గ రాజకీయలను అంతమొందించడం సిపిఎం ద్వారానే సాధ్యమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామిక, వ్యవసారంగాలను దివాలా తీశాయన్నారు. విద్య, వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షలా మారిందన్నారు. ఆర్థిక అసమానతలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని, దేశ ప్రజలు చెమటోడ్చిన కష్టంతో చెల్లించిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదాని లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అమ్మేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై, ప్రజల హక్కులపై, రాష్ట్రాల హక్కులపై, రాజ్యాంగంపై దాడి జరుగుతోందని అన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో తాత్సారం చేస్తున్న నేపథ్యంలో దీనిపై సిపిఎం పోరాడుతుందని అన్నారు. పల్నాడు జిల్లాలో పేదలందరికీ కూడు, గూడు కోసం, నకిలీ విత్తనాలు భారిన పడి నష్టపోయిన రైతులు పక్షాన, రైతుల

జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ విజ్ఞప్తి

వద్ద దళారులు పంటలు కొని డబ్బులు ఇవ్వని ఘటనల్లో బాధితుల పక్షాన సిపిఎం పోరాడి న్యాయం చేసేందుకు కృషి చేసిందన్నారు. తాగు, సాగు నీటి అవసరాలు తీర్చే వరికపూడిసెల ప్రాజెక్టు సాధనకు వరికపూడిసెల జల సాధన సమితి ద్వారా ప్రభుత్వం ఒత్తిడి పెంచుతామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిధులివ్వాలని సిపిఎం పోరాడిందని, ప్రజాపోరు ప్రచార యాత్ర ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వాధికారులకు నివేదించామని చెప్పారు. స్కీమ్ వర్కర్లు చిరుద్యోగులపై రాజకీయ వేధింపులపై పోరాడింది సిపిఎం మాత్రమేనని గుర్తు చేశారు. మైనింగ్ పేరుతో నాటి ప్రభుత్వ చర్యల వల్ల భూములు కోల్పోయిన యడవల్లి రైతులకు భూ సేకరణ చట్ట-2013 ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ఉద్యమించిందన్నారు. రైతు, కార్మిక, వ్యవసాయ కూలి, విద్యార్థులు, యువకులు, మహిళలు, ఇతర అన్ని రంగాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నిత్యం పోరాటాలు చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న జిల్లా మహాసభ జయప్రదానికి అందరూ సహకరించాలని విజయ్‌కుమార్ కోరారు.

పోలీస్ శాఖ 'మీతో - మేము' కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన, జాగ్రత్తలు తెలిపేలా 'మీతో - మేము' అనే వినూత్న కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా పోలీసులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకు భయపడి, క్షణికావేశంలో కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇది ఎంత మాత్రమూ సరికాదని అన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో డిజిటల్ బోర్డులు పెట్టి ప్రజలకు చట్టాల అవగాహన కల్పించడం హర్షణీయమన్నారు. గంజాయి, ఇతర వ్యసనాలకు అలవాటుపడి నేరాలు చేస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు నేరాల బారిన పడకుండా ఉండేందుకు 'మీతో మేము -మీ రక్షణ - మా బాధ్యత' కార్యక్రమం చేపట్టామని చెప్పారు. అన్ని పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌ల వద్ద డిజిటల్ డిస్‌ప్లే స్క్రీన్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు అవగాహన, సమాచారాన్ని అందించడం, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సేవలను పెంపొందేందుకు సహాయపడుతుందని తెలిపారు. ఈ డిజిటల్ స్క్రీన్లు శాటిలైట్ సిస్టంతో అనుసంధానంగా పని చేస్తాయన్నారు. ఈ సిస్టం ద్వారా ఉపయోగకరమైన సమాచారం, వీడియోలు,చిత్రాలు ప్రసారం అవుతాయని చెప్పారు. సైబర్ నేరాల పట్ల అవగాహన, ఫోన్‌కు ఏదైనా లింకులు వచ్చినప్పుడు వాటిని ఓపెన్ చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా మసులుకోవాల్సిన పద్ధతులు, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే పడే శిక్షలు, రోడ్డు భద్రత మీద పూర్తి అవగాహన తదితర అంశాలపై వీడియోలను రూపొందించినట్లు వివరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేకంగా 3 ద్విచక్ర వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెవి.సంతోష్ (అడ్మిన్), నరసరావుపేట డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, జగదీష్, వెంకట రమణ పాల్గొన్నారు.

డిజిటల్ సైన్‌బోర్డు, వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

ఉపాధ్యాయులకు ఆదర్శం కొమ్మారెడ్డి కేశవరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మణరావు మాట్లాడుతూ కేశవరెడ్డి గణిత ఉపాధ్యాయుడైనా సాహితీవేత్తగానూ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ముఖ్యంగా అనువాద రచయితగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఎరిక్ ఆక్స్‌పామ్ వంటి ప్రపంచ స్థాయి రచనతోపాటు, చరిత్రపై ఇఎంఎస్ నంబూద్రిపాద్ రాసిన పుస్తకాన్ని కొమ్మారెడ్డి తెలుగులోకి అనువదించారని తెలిపారు. సాహితీవేత్త రావెల సాంబశివరావు మాట్లాడుతూ కేశవరెడ్డి సాహితీ పురస్కారం ఓల్గాకు ఇవ్వటం ముదాహవమన్నారు. రిటైర్డ్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ కొమ్మారెడ్డి సున్నిత మనస్తత్వం కలవారని, ఆయన రచనలు ఎంత గొప్పవో, ఆయన వ్యక్తిత్వం అంత గొప్పదని అన్నారు. ఆయన సాహిత్య రచనకు గోర్కి నవల 'నగరం' ప్రేరణని తెలిపారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ ఓల్గా వంటి వారు సాహిత్య రచన చేస్తున్నారని కొనియాడారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ మాట్లాడుతూ కేశవరెడ్డి సాహిత్య రంగానికి ఎంతో కృషి చేశారని, సాహితీ స్రవంతి ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించారన్నారు. కేశవరెడ్డి ఆశయాన్ని కుటుంబం పంచుకొని, ప్రతి ఏటా సాహిత్య పురస్కాలు ఇవ్వటం అభినందనీయమని అన్నారు. తెలుగు సాహిత్యంలో భావజాల రంగంలో ఒక మలుపు ఓల్గా సాహిత్యం అని, ప్రతిఘటనను కూడా చాలా సున్నితమైన పదాలతో చెప్పటం ఆమె ప్రత్యేకతని చెప్పారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ జిఎం లక్ష్మయ్య మాట్లాడుతూ కేవశరెడ్డి చివరిశ్వాస వరకూ సాహిత్య కృషి చేశారన్నారు. కేశవరెడ్డితోపాటు, ఓల్గాకు ప్రజాశక్తితో ఎంతో అనుబంధం ఉందన్నారు. సాహిత్య రంగంలో ఉన్న అన్ని ప్రక్రియల్లోనూ ఓల్గా రచనలు ఉన్నాయని, ఇప్పటి దాకా దాదాపు 80 పుస్తకాలు రచించారని తెలిపారు. పురస్కార గ్రహీత ఓల్గా మాట్లాడుతూ ఆమె బాల్యం, విద్యాభ్యాస్యం, విద్యార్థి ఉద్యమంతో గుంటూరు జిల్లాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కేశవరెడ్డి అనువాద రచనలు చాలా గొప్పవని, అందులో ఎరిక్సన్ అనువాదం అసాధారణమైనదని చెప్పారు. సాహిత్య రచనకు, అనువాద సాహిత్యానికి తెలుగులో సమ ప్రాధాన్యత ఉందని, ఒకోకసారి అనువాద సాహిత్యమే ఎక్కువగా ఉందా? అనే భావన కలుగుతుందన్నారు. అనువాద సాహిత్యాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తక పఠనం అలవాటును పెంచటానికి కొమ్మారెడ్డి ఆశయ సాధకులు, సాహితీ సంస్థలు కృషి చేయాలని కోరారు. అనంతరం ఓల్గాకు కేశవరెడ్డి సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. శాలువా, రూ.25 వేల నగదు పురస్కారం, ప్రశంసాపత్రంతో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి జీవితంపై రూపొందించిన పుస్తకాన్ని ఓల్గా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు నూతలపాటి కాళిదాసు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, కేశవరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గొర్రె కడుపు నుండి 1.5 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు వెలికితీత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మితిమీరిన ప్లాస్టిక్ వ్యర్థాలతో నోరు లేని మూగ జీవులు అనారోగ్యం పాలవుతున్నాయని ప్లాస్టిక్ కవర్లు వినియోగం తగ్గించడం పర్యావరణానికి, మూగజీవులకు మంచిదని రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామ పశు వైద్యులు డాక్టర్ ఆవుల సాయి మహేష్‌రెడ్డి అన్నారు. ఆరేపల్లికి చెందిన రైతు మిరపెల్లి వెంకటేశ్వర్లుకు చెందిన గొర్రె 5 రోజులుగా మేత తీసుకోకపోవడం అస్వస్థతకు గురి కావడంతో శుక్రవారం కర్లకుంట గ్రామ పశు వైద్యులు డాక్టర్ సాయి మహేష్ రెడ్డిని సంప్రదించారు. పరీక్షించిన డాక్టర్ సాయి మహేష్ రెడ్డి గొర్రెకు 2 గంటలకు పైగా శ్రమించి రుమెనోటమీ ఆపరేషన్ నిర్వహించి గొర్రె కడుపు నుండి 1.5 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు తీసి గొర్రె ప్రాణం కాపాడారు. చికిత్స అనంతరం గొర్రె ఆరోగ్యంగా ఉందన్నారు. ఇదే తరహాలో ఇటీవల గేదెకు కడుపు నుండి 6.5 కిలోల వ్యర్థాలను సస్త్ర చికిత్స ద్వారా వెలికితీసి రూ.లక్ష విలువైన పశువు ప్రాణం కాపాడారు.

టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్‌గా మన్నవ ప్రమాణస్వీకారం

హాజరైన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, టిడిపి నేతలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్(టీఎస్) చైర్మన్‌గా నియమితులైన మన్నవ మోహన్ కృష్ణ శుక్రవారం రాత్రి గుంటూరులో బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సిద్ధార్థ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కాగా వీరి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. పెమ్మసాని మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి అమెరికాలో వ్యాపారవేత్తగా రాణించి తిరిగి స్వస్థలం గుంటూరు వచ్చిన మోహన్ కృష్ణ టిడిపి విజయంకోసం కృషి చేశారన్నారు. గుంటూరు జే.కే.సి కాలేజీలో చదువుకున్న దగ్గరనుంచి అమెరికాలో జీవితం ప్రారంభం వరకు గుంటూరు యువతకు స్ఫూర్తిగా ఉంటారన్నారు. వ్యాపారవేత్తగా రాణించి, నాయకుడిగా మెప్పించి, ఒక ఆధిపతిగా ఎదిగిన తర్వాత మాతృదేశానికి ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో తిరిగి వచ్చారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఎన్టీఆర్ ట్రస్ట్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ తదితర అంశాల్లో ఎమ్మెల్యే బాలకృష్ణకి మద్ధతుగా ఉంటూ వైద్య సేవలను



మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. మన్నవ మోహన కష్ణ భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, మాదిగ కార్పొరేషన్ ఏపీ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, టిడిపి నాయకులు వేముల కొండ శ్రీనివాస్, ముత్తినేని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

34వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయం రావలసినబకాయిల కోసం చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 34 రోజులు చేరుకున్నాయి. పక్కాగా కొత్త ఇల్లు నిర్మాణానికి కార్మికులు శ్రీకారం చుట్టారు. తమ శక్తినంత కూడ తీసుకొని రేకుల షెడ్లు వేసుకుంటున్నారు. ఆర్థిక స్తోమతను బట్టి గుడిసెలు వేసుకోవటానికి కూడా సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏఐఎఫ్ టి యు నాయకులు కే ఆదినారాయణ మాట్లాడుతూ మరింత పట్టుదలగా ఉద్యమాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. సమస్య పరిష్కారానికి పోరాటం తప్ప మరో మార్గం లేదని చెప్పారు. మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని

సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి అంకయ్య, ఆశీర్వాదం, యెహోషువ, సాంబయ్య, శారద, రమాదేవి, దుర్గమ్మ, సారమ్మ, గురవయ్య, ఇమాంబి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలలో గుంటూరు వైద్యుల సేవలు

సంక్రాంతి వరకు కొనసాగనున్న వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేరళలోని శబరిమలకు వచ్చే వారికి వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రానికి చెందిన వైద్యుల బృందాలు తరలి వెళ్లనున్నట్లు సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. తొలిసారిగా ట్రావెన్ కోర్ సంస్థానం వారు ప్రైవేటు వైద్యుల సేవలను వినియోగించుకునేందుకు అంగీకరించిందన్నారు. ట్రావెన్కోర్ సంస్థాన ఆస్థాన వైద్యులు డాక్టర్ నారాయణ అభ్యర్థన మేరకు తెలుగు రాష్ట్రాలకు చెందిన వైద్యుల బందాలు విడతలవారీగా వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆరుగురు వైద్యులతో కూడిన ఒక్కో బందం నాలుగు రోజులు పాటు శబరిమలకు వచ్చేవారికి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ వైద్య సేవలు జనవరి 17వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎంతో ప్రతిష్టా త్మకమైన ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు ప్రైవేటు వైద్యుల సేవలు కోరిన మీదట అక్కడికి వెళ్లే వైద్యులకు సంబంధించి అన్ని రకాల అర్హతలు, సంబంధిత

మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. అక్కడ పనిచేసే వైద్యులకు దేవస్థానం బోర్డు ఎంప్లాయ్ గా గుర్తింపు కార్డు ఇవ్వడం ఇస్తున్నారని పేర్కొన్నారు. శబరిమలకు వచ్చే వారిలో చాలా మందికి ఆయాసం, ఒళ్ళు నొప్పులు, దగ్గు జలుబు తో బాధపడు తుంటారని, అతి కొద్ది మంది మాత్రమే గుండె జబ్బులతో ఇబ్బంది పడతారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఏ విధమైన వైద్య సేవలు పొందాలన్నా పంబ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న వైద్యశాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ మోపర్తి శ్రీనివాస్, డాక్టర్ లావు సతీష్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ (జూనియర్ డివిజన్) సివిల్ జడ్జి వారి కోర్టులో

EP NO 70/19,
OS AS 44/14, OS NO 194/2008

బిట్వీన్
చితిరాల రామారావు. ....డి.హెచ్.ఆర్
మరియు
1. షేక్ ఖాశింబీ (డైడ్) భర్త మాదార్ వలీ హసానాబాద్ గ్రామం క్రోసూరు మండలం, పల్నాడు జిల్లా
2 పుచ్చుల వెంకటేశ్వరావు, తండ్రి సోమరాజు, బృందావన గార్డెన్స్ , గుంటూరు పట్టణం... జే.డీ.ఆర్

మీలోని రెండోవ వారి పైన (డి హెచ్ ఆర్) చితిరాల రామారావు గారు పై కోర్టులో డిక్రీ అమలు కోసం పిటీషన్ దాఖలు చేసి యున్నారు. అనేక సార్లు మీకు కోర్టు నుండి నోటీసులు పంపినప్పటికి మీరు కావాలని నోటీసులు తిప్పి పంపియున్నారు. మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.20-12-2024 తేదీకి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజున పై కోర్టులో స్వయంగా గానీ మీ ప్లీడరు ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల కోర్టు వారు మీపై పరోక్షంగా తీర్మానించగలరని తెలియజేయట మైనది.

వాయిదా తేదీ 20-12-2024
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

ఇట్లు
అంకాళ్ళ వెంకటేశ్వర్లు
వాది తరుపు న్యాయవాది
సత్తెనపల్లి, పల్నాడు జిల్లా

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

ఈ.పి. నెం. 36/2023 ఇన్ ఓ.యస్.నెం. 73/2021

బిట్వీన్ :
Pattan Bajikhan .... డిహెచ్ఆర్.
ఎదిరి
Adusumalli Vijaya and another .... జెడిఆర్స్
To,
JDR1 : Adusumalli Vijaya, W/o Late Vijay
JDR2 : Adusumalli Jhansi, D/o Late Vijay
Both are R/o H.No. 4-25, Adusumalli Vari street, Burripalem Village, Tenali Mandal.

పై నెంబరు డిక్రీ అమలు పిటీషన్‌లో మీకు శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు ఆర్డరు 21 రూల్ 66 సిపిసి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 12-12-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు ఈ.పి.ని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి వారి ఉత్తర్వులతో)
వాయిదా : 12-12-2024

జంధ్యాల శివగణేష్,
డిహెచ్ఆర్ తరపు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 7893096457

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : TENALI

I.A. No. 409/2023 in O.S. No. 33/1986

Between :
The Gram Panchayat, Kuchipudi, rep. by its Executive Officer Bollu Anil Kumar, S/o Venkata Subbarao, aged about 42 yrs, Hindu, Executive Officer / Panchayat Secretary, Kuchipudi Gram Panchayat, Amarthaluru Mandal, Bapatla District.
.... Petitioner / 1st Defendant
AND
Yarlagadda Ankineedu Prasad (1st Plaintiff) & others .... Respondents
To,
R1 : Yarlagadda Ankineedu Prasad (1st Plaintiff), S/o Late Raja Yarlagadda Sivaram Prasad, Zamindar of Devara konda Paragana, Challapalli, Krishna District.

పై నెంబరు దావాలో I.A. No. 409/2023 చెక్ పిటీషన్‌లో మీకు శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 20-12-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు చెక్ పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 20-12-2024

ఇట్లు
బి.విజయకుమార్
పిటీషనర్/1వ ప్రతివాది తరపు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 94408 53217.

తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

కూటమి ప్రభుత్వంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం ప్రగతి పథంలో పరుగులు తీస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం 3వ వార్డు బాలాజీ నగర్‌లో రూ.70 లక్షలతో 9, 10, 11 లైన్‌లో జిఎస్‌బి రోడ్లు, సిసి డ్రైన్లు, ప్రగతి నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో 16 లైన్లు డస్ట్ రోడ్లు, రూ.16.15 లక్షలతో 10వ వార్డు పాత గుంటూరు అంకమ్మ తల్లి గుడిసెంటర్ అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రోడ్లు, డ్రైన్లు లేని పరిస్థితిలో ఆయా ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలల్లోనే ప్రజలకు రోడ్లు, డ్రైన్లు కష్టాలను తీర్చేందుకు సుమారు రూ.90 లక్షలతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, షాజీలా, అల్లం బాజీ, బట్ట రాజా, సుబ్బారావు, జడ సురేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ పోయినది

పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన ఏసుపోగు పరంజ్యోతి కుమారుడు ఏసుపోగు జాన్ జోసఫ్ తెలిపిన వివరాల ప్రకారం తన పదవ తరగతికి చెందిన **రోల్ నెంబర్ 2214127292** సర్టిఫికేట్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గల ఫోటోస్టాట్ సెంటర్ నందు జిరాక్స్ నిమిత్తం వెళ్ళి జిరాక్స్ తీసుకుని తిరిగి ఇంటికి వచ్చి చూడగా మార్గం మధ్యలో పదవ తరగతి ఓరిజనల్ సర్టిఫికేట్ పోయినది. సర్టిఫికేట్ కోసం ఎంత వెతికిన, దారిలో వ్యక్తులను అడిగిన లభించలేదు. పై నెంబరు గల సర్టిఫికేట్ ఎవరికైన దొరికిన యడల మాకు అందజేయగలరని కోరుతున్నాము.సమాచారం కోసం మా **సెల్ నెంబర్ 9182402691** సంప్రదించగలరు.

యుజిడి కార్మికుల బకాయి జీతాల చెల్లింపునకు

జిఎంసి స్టాండింగ్ కమిటీ ఆమోదంపై యూనియన్ హర్షం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర పాలక సంస్థలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కార్మికుల జీతాల బకాయిల చెల్లింపు, అవుట్‌సోర్సింగ్ కార్మికు లందరికీ పండగ కానుక రూ.వెయ్యి చెల్లిం పునకు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీలో ఆమోదించినందుకు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడుకు, కమిషనర్ పులి శ్రీనివాసులుకు ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం యూనియన్ నాయకులు మేయర్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో విలీనం చేసినప్పుడు 9 నెలల పాటు రూ.మూడు వేల జీతం తగ్గించి చెల్లించారని, ఆ బకాయిలు చెల్లించాలని అధికారులకు వివిధ సందర్భాలలో వినతిపత్రాలు అందజేయడం జరిగిందని, ఆమేరకు గత కమిషనర్ కీర్తీ చేకూరి ఫైల్ తయారు చేయించి, బకాయిలు చెల్లింపునకు హామీ ఇచ్చారని, శుక్రవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపారన్నారు. అలాగే సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా 16 రోజుల సమ్మె సందర్భంగా పండుగ కానుక రూ.వెయ్యి ఇచ్చేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చి జీవో ఇవ్వటం జరిగిందని, ఉత్తర్వుల అమలు కోసం యూనియన్ కృషి చేసినట్లు చెప్పారు. అలాగే సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించేందుకు, కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికీ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మేయర్‌ను కలిసిన వారిలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు వై.ప్రభుదాసు, షేక్ రసూల్, టి.రాంబాబు, కె.మరియదాసు, షేక్.అలీమ్ తదితరులు ఉన్నారు.

నేటి నుండి వర్సిటీలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా సౌత్ వెస్ట్ జోన్ పురుషుల అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వర్సిటీ సన్నద్ధమైంది. ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబర్ మూడో తేదీ వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆయా రాష్ట్రాల విశ్వవిద్యాలయాల నుంచి క్రీడాకారులు వర్సిటీకి చేరుకుంటున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో క్రీడాకారులు వర్సిటీకి చేరుకున్నారు. పోటీల నిర్వహణ సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలపై శుక్రవారం సాయంత్రం పోటీల నిర్వాహక కార్యదర్శి, యూనివర్సిటీ వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పి. పి .ఎస్ . పాల్ కుమార్ మేనేజర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇక్కడ ఉన్న క్రీడ సదుపాయాలతో దేశంలోనే 14వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో క్రీడా వసతి గృహం, యోగా సెంటర్, 8 కోట్లతో నిర్మించిన సింథటిక్ ట్రాక్, ఫ్లడ్ లైట్స్, క్రీడాజిమ్, విశాలమైన క్రీడా ప్రాంగణాలు ఉన్నాయని పేర్కొన్నారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ప్రత్యేక వసతి సదుపాయాలు కల్పించామని వివరించారు. క్రీడాకారులు ఆల్ ఇండియా యూనివర్సిటీ నియమ నిబంధన ప్రకారం పోటీలలో పాల్గొనాలని ఆయన సూచించారు. వర్సిటీ నిబంధనల మేరకు ప్రతి ఒక్క యూనివర్సిటీ జట్టుకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామయ్య, వర్సిటీ యోగా సెంటర్ కోఆర్డినేటర్ డి. సూర్యనారాయణ, వ్యాయామ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఇన్నయ్య, డాక్టర్ రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు - ఎనిమిది బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి ఈపూరు : మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడులలో గ్రామానికి చెందిన అనిల్ అక్రమ మద్యం వ్యాపారం చేస్తుండగా అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 8 ట్రోపికనా మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం బ్రిడ్జి తండా అటవీ ప్రాంతాలలో సిబ్బందితో కలిసి ముమ్మర తనిఖీలు చేపట్టామన్నారు. అక్రమంగా మద్యం విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై కె శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోర్టులో లొంగిపోయిన వైసిపి నాయకుడు మన్నెయ్య

ప్రజాశక్తి- మాచర్ల

పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న దుర్గి మండల వైసిపి నాయకుడు వూరబండి మన్నెయ్య శుక్రవారం మాచర్ల కోర్టు ఎదుట లొంగిపోయారు. దుర్గి మండలం జంగమేశ్వరపాడుకు చెందిన మన్నెయ్య మూడు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మన్నెయ్య ముఖ్య అనుచరుడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన్నెయ్య అజ్ఞాతంలోకి వెళ్లాడు. ప్రస్తుతం కోర్టులో లొంగిపోగా జడ్జి రిమాండ్ విధించారు.

కబడ్డీలో పిడుగురాళ్ల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కబడ్డీ సీనియర్, జూనియర్ విభాగాల్లో పట్టణానికి చెందిన స్కాలర్స్, తిరుముల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ కనిబరిచారు. గుంటూరులోని లోటస్ స్కూల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో సీనియర్ విభాగంలో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని స్కాలర్స్ సంస్థల చైర్మన్ జి.పిచ్చిరెడ్డి, డైరక్టర్లు శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జగదీష్, పిఇటీ సాంబిరెడ్డి తెలిపారు. జూనియర్స్ విభాగంలో తిరుముల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల డైరక్టర్ బొల్లా గిరిబాబు, ప్రిన్సిపాల్ నరేష్, పిఇటి నాగరాజు చెప్పారు.

నిప్స్ కాలేజీలో ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక నిప్స్ ఫార్మసీ కళాశాలలో 63వ నేషనల్ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు నిప్స్ స్పోర్ట్స్ ఫియస్టాను మూడ్రోజులపాటు నిర్వహించిన పోటీలు శుక్రవారం ముగిశాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఎన్ సురేష్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా జిల్లా స్పోర్ట్స్ అధారిటి ఆఫీసర్ పులిచర్ల నరసింహారెడ్డి హాజరై మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించి విజ్ఞానాన్ని పెంచుకునేందుకు, దేశ ఔన్యత్యాన్ని పెంచడానికి క్రీడలూ ఒక మార్గమన్నారు. పోటీల్లో 23 ఫార్మసీ కళాశాలల నుండి 78 జట్లు పాల్గొన్నాయని, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, త్రోబాల్, టెన్నికాయిట్, లాంగ్ జంప్ పోటీల్లో తలబడ్డారని ప్రిన్సిపాల్ తెలిపారు.

విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందిస్తున్న అతిథులు, క్రీడోత్సవాల నిర్వాహకులు

బాల్య వివాహాలను అరికట్టాలని అవగాహన

ప్రజాశక్తి- వెల్దుర్తి

బాల్య వివాహాల నివారణపై మండల పరిధిలోని గుండ్లపాడులో అవగాహన చేపట్టారు. అంగన్వాడీ టీచర్లు సాగర్ కుమారి, సామ్రాజ్యం, కోటమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడి సెంటర్లలో, ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్వైజర్ లీలావతి హాజరై మాటాడారు. బాల్య వివాహాలను అరికట్టి బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. బాలికలు ఉన్నత చదువులు చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరగోపాల్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సిడిపిఒ శాంతకుమారి కోరారు. పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ అమ్మాయిలందర్నీ చదివించాలని, వారి ఎదుకుదలకు అందరూ చేయూత నివ్వాలని కోరారు. బాల్య వివాహాలతో వారి ఆరోగ్యాన్ని, భవిష్యత్‌ను దెబ్బ తీయొద్దన్నారు. అనంతరం ఎంఇఒ లక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు ఆర్.సామ్రాజ్యం, ఎస్.భూలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఉక్కు సత్యాగ్రహం సినిమా విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

జనం ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో జనం స్టార్, పల్నాడు ప్రాంతవాసి ప్రస్తుతం విశాఖ పట్నంలో స్థిరపడిన పి.సత్యారెడ్డి స్వీయ దర్శకత్వంలో, నిర్మాతగా వ్యవహరిస్తూ హీరోగా నటించిన విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో తెరకెక్కిన 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా 450 థియేటర్లకు పైగా విడుదలవుతూ మాచర్ల పట్టణంలోనూ విడుదలైంది. సినిమాను ప్రజలు ఉత్సాహంగా తిలకించారు. పాటల రచయితగా, రచన సహకారం అందించిన వేముల శ్రీనివాసరావు (శ్రీ వేముల) మాచర్ల పట్టణ వాసి కావటం విశేషం. సినిమాను విశ్రాంత డిఇఒ గాదె రామకృష్ణారావు, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి చూసి అభినందించారు. వేముల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సినిమాను అందరూ ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సినిమాలో 3 పాటలు రాసి, పాడి స్వయంగా నటించిన ప్రముఖ విప్లవ గేయ రచయిత గద్దర్ ఈ సినిమాకు ప్రాణం పోశారని, ఆయనకు ఇదే చివరి చిత్రమని సినిమా బృందం తరుపున నివాళులర్పించారు. రచయితగా తనకు అవకాశం కల్పించిన హీరో పి.సత్యారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఈ సినిమాలో లాయర్ పాత్ర చేయటం పట్ల సాయిమార్కండేయ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణం కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో సోలార్ పవర్ ప్లాంట్‌ను సుమారు రూ.100 కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. అందులో భాగంగా భూములను జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ భానుకీర్తి శుక్రవారం పరిశీలించారు 883 సర్వే నంబర్‌లో 112 ఎకరాలు ఉండగా అందులో 100 ఎకరాల్లో ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నారు. నిర్ణయించిన భూమి హద్దులను ఇప్పుడున్న పవర్ హౌస్‌కు ఎంత దూరంలో ఉన్నది? భూమికి సంబంధించిన మార్కెట్ ధర ఎంత? అనే విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎస్ఇకె వెంకటరమణ, ఆర్ఐ రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్లు వి.ప్రసాద్, అర్జున్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

గిన్నిస్ పోటీల ఎంట్రీఫీజు కోసం అథ్లెట్ వినతి

ప్రజాశక్తి - వినుకొండ

ఫిబ్రవరిలో లడక్‌లో 9 రోజులపాటు జరగనున్న ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఎఎస్ఎఫ్ఎల్ రన్నింగ్ మారథాన్ పోటీల్లోనూ పాల్గొననున్నట్లు పట్టణానికి చెందిన అథ్లెట్ అబ్దుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికిముందు న్యూఢిల్లీలోని జవహల్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం జరిగే గ్రీన్ మారథాన్, 8న జైపూర్‌లో ఇండియన్ ఆర్మీ హానర్ రన్ ఆధ్వర్యంలో జరగనున్న పరుగు పందెంలో, 15న వైజాగ్ ఇండియన్ నేవీ మారథాన్ ఆధ్వర్యంలో జరగనున్న పరుగు పందెంలో తాను పాల్గొనబోతున్నట్లు పేర్కొన్నారు. ఆసియాలో మొదటి, ప్రపంచంలోనే అత్యధికంగా ఘనీభవించిన పాంగోగ్ సరస్సు ఉన్న ఎప్పుడు మైనస్ ఉష్ణోగ్రతలు ఉండే లడక్‌లో ఎముకలు కొరికే చలిలో 41 కిలోమీటర్లు, 21 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు పరువు పందెంలో పాల్గొనే అవకాశం తనకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇటీవల కాశ్మీర్లో జరిగిన మారథాన్‌లో పాల్గొన్నప్పుడు ఇండియన్ ఎలైడ్ రన్నింగ్ మారథాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సునీత గోద్రా తనలోని ప్రతిభను గుర్తించి గిన్నిస్ వరల్డ్ రికార్డులో పాల్గొనే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు రూ.70 వేలు చెల్లించాల్సి ఉందని, తనకు ఎవరైనా ఫీజు సాయం చేస్తే గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

చట్ట ప్రకారమే రెడ్‌బుక్ శిక్షిస్తుంది : శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రెడ్‌బుక్‌ను తలుచుకొని వైసిపి నేతల వెన్నులో వణుకు మొదలైందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఎద్దేవ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. వైసిపి హయాంలో నారా చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌పై, వారి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు, అసభ్య పోస్టులు పెట్టిన వారందరికీ ఇప్పుడు తత్వం బోధ పడిందని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా ఐదేళ్ల అడ్డగోలు పోస్టులు పెట్టి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని, ఇప్పుడు ఒక్కొక్కరిగా అరెస్ట్ అవుతుండడంతో వారి పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోనని వణుకుతున్నారని ఎద్దేవా చేశారు. హద్దులు దాటిన నాటి సోషల్ మీడియా పోస్టింగ్‌లకు సంబంధించి ఇప్పటికే కొంతమందిని అరెస్ట్ చేశారని, మరికొందరు పరారీలో ఉన్నారని, వారిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. తప్పు చేసిన వారిని చట్ట ప్రకారమే రెడ్‌బుక్ శిక్షిస్తుందని పేర్కొన్నారు.

సిఐడి విచారణ కోసం చంద్రబాబును కోరతాం : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

సౌర విద్యుత్ ఒప్పందాలకు సంబంధించి అవినీతి ఆరోపణలపై సీఐడీ విచారణ జరిపించాలని సిఎం చంద్రబాబును కోరుతామని అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చెప్పారు. సౌరవిద్యుత్ పేరిట వేలకోట్ల అవినీతి, దోపిడీలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అడ్డంగా దొరికారని, దోషులకు సరైన శిక్షలు పడాలంటే సరైన దర్యాప్తు జరగాలని అన్నారు.

యువత చేతుల్లోనే దేశ ప్రగతి

ప్రజాశక్తి- మాచర్ల :

ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరమని స్వామి వివేకానంద అన్నారని, ఆ క్వాలిటీలు మీలో ఉన్నాయో లేవో ఒక్కసారి పరిశీలించుకోవాలని కాలేజి విద్యార్థులకు మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు సూచించారు. శ్రీరామకృష్ణసేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'భారత జాతికి నా హితవు' అనే పుస్తకం ఆధారంగా జాగృతి పోటీలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ దేశ ప్రగతి యువత చేతుల్లోనే ఉందని, ప్రతి వ్యక్తికి 18-25 వయస్సు చాలా కీలకమైనదని, మీ భవిష్యత్తును నిర్ణయించేది ఈ సమయమేనని చెప్పారు. అనవసరమైన విషయాలుపై ఎక్కువుగా శ్రద్ధ చూపద్దని, కఠిన లక్ష్యాలను నిర్ధేశించుకొని వాటిని సాధించాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలయ్య, సమితి సభ్యులు శ్రీనివాస్, చంద్రారావు, లెక్చరర్ దుర్గ పాల్గొన్నారు.

రాజధానిలో ఉపాధి కల్పనకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి నిర్మాణానికి చట్టబద్ధత కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి హెచ్ బాబురావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందాలను బహిర్గతం చేయాలన్నారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులోని హెచ్ ఎస్ ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం సిపిఎం రాజధాని డివిజన్ మూడవ మహాసభ జరిగింది. సభలో బాబూరావు మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి తిలోదకాలిచ్చి మూడు రాజధానుల ప్రతిపాదనను ముందుకు తీసుకురావడంతో అనిశ్చితి వాతావరణం నెలకొందని, భవిష్యత్‌లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా అలాంటి పరిస్థితి తలెత్తకుండా చట్టబద్ధత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాతపూర్వకంగా హామీ ఇవ్వనందున రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వం అనడం దారుణమన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పదేళ్ల పాలనలో మాటలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలకు చేసిందేమీ లేదని అన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మోడీతో జతకట్టి రాష్ట్రాన్ని, అమరావతి అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ 15 వేల కోట్లు, హడ్కో ఇతర ఆర్థిక సంస్థల నుంచి మరో రూ 15 వేల కోట్లు నిధులు వస్తాయని కూటమి ప్రభుత్వం చెబుతోందని, ఇప్పటికే రాష్ట్రం అప్పు రూ.15 లక్షల కోట్లు ఉందని అంటూ మళ్లీ అప్పులు చేయడం సరైంది కాదని అన్నారు. రూ 15 వేల కోట్లు అప్పుగా కాకుండా గ్రాంటుగా ఇవ్వాలని కోరారు. విభజన హామీల చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం బాధ్యత కేంద్రానిదే నన్నారు. రాజధాని అమరావతిలో ఉపాధి కల్పనకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను రూపొందించాలని,ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు.రాజధానిలో రైతుల కిచ్చిన ప్లాట్ల పై బ్యాంకులు రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజధానిలో ఉచిత విద్య, వైద్యం తదితర హామీలను అమలు చేయాలన్నారు. విద్యుత్ ఒప్పందం విషయంలో మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డికి రూ. 1750 కోట్లు ముడుపులు అందాయన్న వ్యవహారంపై కేంద్రం తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తోందని అన్నారు. సదరు ఒప్పందాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పక పోవడంలోని మర్మం ఏమిటని నిలదీశారు. రాజధాని అమరావతిలో రైతులు,రైతు కూలీలు, ఇతర వర్గాల సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు చేసిందని, మున్ముందు కూడా కొనసాగిస్తుం దని చెప్పారు. అంబానీ, ఆదానీ లకు ప్రజా సంపదను దోచిపెడుతున్న బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ, మొన్నటి లోకసభ ఎన్నికలలో సింగిల్‌గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిన బిజెపి నాయకులు సరిపడా సీట్లు రాక నితీష్ కుమార్, చంద్రబాబు మద్దతు పొందవలసి వచ్చిందన్నారు. బిజెపి బలం 303 సీట్లు నుంచి 240కి తగ్గాయని, సిపిఎం చొరవతో 28 పార్టీలతో ఇండియా కూటమి ఏర్పాటు అందుకు కారణమన్నారు. రాష్ట్రంలో కూటమి పాలనలో కూరగాయలు, పెట్రో ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. మహిళలు,బాలికలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు చేయడం లేదని,ఇసుక అందక భవన నిర్మాణ కార్మికులకు 15 రోజులకు మించి పనులు దొరకడం లేదని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రూ 35 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపితే ఐదు నెలల్లో కూటమి ప్రభుత్వం రూ 20వేల కోట్ల భారం మోపిందని అన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి కార్యదర్శి నివేదికను సభలో ప్రవేశపెట్టారు. తొలుత సిపిఎం జెండాను, అమరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఈమని అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు బి లక్ష్మణ రావు, నాయకులు ఎం భాగ్య రాజు, వి వెంకటేశ్వర్లు, కుంభా ఆంజనేయులు, పేరం బాబురావు, జె నవీన్ ప్రకాష్ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు పి రాఘవులు

అవినీతి అదానీని అరెస్ట్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - తుళ్లూరు : అవినీతి అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ రాజధాని ప్రాంతం తుళ్లూరులో సిపిఎం నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ దగ్గర నుంచి గ్రంథాలయం సెంటర్ వరకు ప్రదర్శన జరిగింది. అవినీతి పరుడు అదానీని అరెస్ట్ చేయాలని, విద్యుత్ సోలార్ ఒప్పందాలను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఒప్పందంలో ఆదానీ నుంచి రూ.2,029 కోట్లు ముడుపులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు అందినట్లు అమెరికాలో కేసు నమోదైందని చెప్పారు. ఈ వ్యవహారంపై ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు నోరుమెదపడం లేదని అన్నారు. అదానికి మోడీ ప్రభుత్వం విమానాశ్రయాలు, పోర్టులు లాంటివి కట్టబెడుతోందని, ప్రజా సంపదను దోచిపెడుతోందని మండిపడ్డారు. అదానీ అవినీతి బండారం బయట పడగానే కెన్యా ప్రభుత్వం అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణంకు సంబంధించిన కాంట్రాక్ట్‌లను రద్దు చేసుకుందని, మోడీ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, ఈమని అప్పారావు, వల్లభాపురపు వెంకటేశ్వరరావు, ఎంభాగ్యరాజు, పేరం బాబురావు, కుంభా అంజనేయులు పాల్గొన్నారు.

.తుళ్లూరులో సిపిఎం నాయకుల ర్యాలీ

డ్రెయిన్ల ఆక్రమణలను తొలిదశలోనే అడ్డుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వీధి దీపాలు, తాగునీటి సరఫరాపై అందే ఫిర్యాదులను స్థానిక సచివాలయ కార్యదర్శులు బాధ్యతతో పరిష్కరించాలని రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను తొలిదశలోనే అడ్డుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సచివాలయ కార్యదర్శులకు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ నల్లచెరువు, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే వీధి దీపాలు, తాగునీటి సరఫరా సమస్యలపై సచివాలయ కార్యదర్శులు భాధ్యత తీసుకోవాలని, ప్రతి రోజు సచివాలయ పరిధిలో ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నేరుగా పరిశీలించిన తదుపరి బిల్లుల చెల్లింపునకు ప్రాసెస్ చేస్తామన్నారు. రోడ్ల మీద, డ్రెయిన్ల మీద ఆక్రమణలను తొలిదశలోనే గుర్తించి తొలగించాలన్నారు. రెడ్డిపాలెం రోడ్‌లో కల్వర్ట్ వద్ద వ్యర్థాలు అడ్డుగా ఉండడం గమనించి, వ్యర్థాలను తొలగించాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నూతన రోడ్ల ఏర్పాటు ప్రతిపాదనల్లో తప్పనిసరిగా ఎండ్ టు ఎండ్ రోడ్, డ్రైన్లు, ఉండేలా చూడాలన్నారు. పర్యటనలో ఈ.ఈ. కోటేశ్వరరావు, డిఈఈ మధుసూదన్, ఏసిపి మల్లికార్జున, ఏఈలు, శానిటరీ ఇనస్పెక్టర్లు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లను పరిశీలిస్తున్న కమిషనర్

ఎన్నారై ఐటిలో ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు సమీపంలోని, ఎన్ఆర్ఐ ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు విలువ, ఓటు నమోదుపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసు అధ్యక్షత వహించి మాట్లాడుతూ భారత పౌరులుగా ఓటు హక్కు ప్రతి ఒక్కరికి వజ్రాయుధం లాంటిదని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ద్వారా మంచి పరిపాలనాపరమైన ప్రభుత్వాన్ని ఎంపిక చేయవచ్చన్నారు. ఓటు ద్వారా మన భవిష్యత్తును మనం నిర్మించుకోవచ్చన్నారు. ప్రతి విద్యార్థి రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు అందరి చేత ఓటు నమోదు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ మోహిని, మేడికొండూరు తాసిల్దార్ కె కళ్యాణి, విఆర్ఓ గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసు

ఎన్నారైలో నేడు, రేపు జాతీయ అలర్జీ సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మండలంలోని చినకాకాని ఎన్నారై మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వేదికగా 30 డిసెంబర్, ఒకటో తేదీన రెండు రోజులపాటు జాతీయ అలర్జీ కాన్ఫరెన్స్ 2024ను నిర్వహి స్తున్నట్లు జాతీయ సదస్సు కన్వీనర్ ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. కృష్ణ గుంటూరు జిల్లాల పిల్లల సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సుకు ఎలర్జీ వైద్యంలో ప్రత్యేక నైపుణ్యం సాధించిన పిల్లల వైద్య నిపుణులు హాజరుకానున్నారని చెప్పారు. మనదేశంలో చాలా ఎలర్జీలు అలాగే ఇతర సంబంధిత వ్యాధులు తీవ్రంగా ప్రబలుతున్నాయని దీనికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. మారుతున్న వాతావరణం, కాలుష్యం విపరీతంగా పెరిగిపోవడం, ఆహారపు అలవాట్లు కారణం అవుతున్నాయి అన్నారు. ఈ క్రమంలో ఆయా అంశాలపై రెండు రోజులు పాటు జరిగే సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. పిల్లలకు సంబంధించిన అలర్జీ మీద నూతన వ్యాధి నిర్ధారణ పరిశోధనలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు మరియు చికిత్స విధానాల మీద చర్చించడం తర్ఫీదు పొందడం వంటివి ఈ సదస్సులో జరుగుతాయని వివరించారు. సదస్సుకు జాతీయ పిల్లల ఎలర్జీ చాప్టర్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణమోహన్ నాయక్ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ రెడ్డి కోశాధికారి ధణేష్ వాల్వేకర్ , వివిధ రాష్ట్రాల నుండి ప్రముఖ వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

రవికాంత్ కర్మాలను సత్కరిస్తున్న రిటైర్డ్ ఎస్పి కోటేశ్వరరావు తదితరులు

ఆధునిక సమాజంలో ఫొటోగ్రఫీకి ప్రాధాన్యం

ప్రజాశక్తి-గుంటూరు

ఆధునిక సమాజంలో లలితకళల్లో చిత్రలేఖనం తర్వాత ఫోటోగ్రఫీ అత్యున్నత స్థానంలో విరాజిల్లుతుందని ఫోటోగ్రఫీ లేని వ్యవస్థను ఊహించలేకున్నామని విశ్రాంత జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, పద్మావతి కళ్యాణ వేదికపై ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో ఫోటో ఎగ్జిబిషన్‌తో పాటు నిష్ణాతులైన ఫోటోగ్రాఫర్లకు అవార్డులు ఇచ్చే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డి. కోటేశ్వరరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుపైగా ఫోటోగ్రఫీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడంతోపాటు రాష్ట్ర ఫోటోగ్రఫీ అకాడమీ కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి జిల్లాకు గర్వకారణమన్నారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆఫ్ ఆర్ట్స్ కల్చర్ అండ్ హెరిటేజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వి ఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక ఫోటోగ్రాఫ్ లక్ష మెదళ్లకు ఆలోచనలను కల్పిస్తుందన్నారు. నేచర్, వైల్డ్, వాటర్, అనిమల్, తదితర ఫోటోగ్రఫీతో పాటు యుద్ధ సన్నివేశాల చిత్రీకరణలో జీవితాలను పణంగా పెడుతున్నవారు ఉన్నారని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన అకాడమీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ జీవన విధానంలో ఫోటోగ్రఫీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఫోటోగ్రఫీ స్థాయిని నూతనత్వాన్ని పెంచేలా సంఘ సభ్యుల సహకారంతో విస్తృతమైన కార్యక్రమాలు అమలు చేయబోతున్నట్లు వివరించారు. కార్యక్రమాన్ని తొలుత దేవస్థానం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఏరియల్ ఫోటోగ్రాఫర్ రవికాంత్ కుర్మాలతో పాటు 20 మందికిపైగా వివిధ రంగాలలో నిష్ణాతులైన ఫోటోగ్రాఫర్లను శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్పి నాగరాజు, ఏపీ ఫోటోగ్రఫీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, మాలతి, ఫోటోగ్రఫీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి పారుదల సదుపాయం లేకనే ఎండిన నారు

ప్రజాశక్తి - నూజెండ్ల

సమగ్ర ఎరువుల యాజమాన్యంతో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం(డీఆర్సీ) పల్నాడు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డిడిఏ) ఎం.శివకుమారి తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు మండలంలోని పమిడిపాడు, కంభంపాడు గ్రామాల్లో వరి, కంది పొలాలను శుక్రవారం పరిశీలించారు. వరినారు మడిలో జింకు, ఇనుము లోపం ఉధృతి ఎక్కువగా ఉందని, మురుగునీటి పారుదల సౌకర్యం లేనందున నారు చనిపోయిందని తెలిపారు. సూక్ష్మ పోషక లోపాల నివారణకు ఆగ్రోమిన్ మాక్స్ లేదా ఫార్ములా-4 లేదా ఫార్ములా-6 ఎకరానికి 500 గ్రాములు చొప్పున పిచికారి చేయాలని సూచించారు. 25 రోజులులోపు నారుతోనే వరి నాట్లు పూర్తిచేయాలని, నాటేముందు దమ్ములో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 150 నుండి 200 కిలోలు వరకు తప్పనిసరిగా వెయ్యాలని చెప్పారు. నాటిన తర్వాత వారం రోజులు వరకు రెండు అంగుళాల నీరు ఉంచి, ఆ తర్వాత పలుచుగా నీరు పెడితే పిలకలు బాగా వస్తాయన్నారు. కంది పంటలో ఎల్ఆర్.జి 52 రకానికి అక్కడక్కడ ఎండు తెగులు ఉందన్నారు. నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ లీటర్ నీటికి మూడు గ్రాములు చొప్పున కలిపి ఎండిన మొక్క మొదలు చుట్టూ నేల తడిచే విధంగా పోయాలని చెప్పారు. వ్యవసాయాధికారుల సూచనల ప్రకారం యాజమాన్య పద్ధతులు పాటించాలని, బయోమందులు వాడాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుగుణ బేగం, వ్యవసాయ విస్తరణ అధికారి ఎలీషా, గ్రామ వ్యవసాయ సహాయకులు హిమబిందు, కోటయ్య పాల్గొన్నారు.

నారు మడిని పరిశీలిస్తున్న అధికారులు

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జూనియర్ సివిల్ జడ్జి మురళీ గంగాధర్‌రావు

అందరి ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం

వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో జూనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అందరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పిడుగురాళ్ల మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మురళీ గంగాధర్‌రావు అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించగా శిబిరాన్ని మురళీ గంగాధర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న జీవన శైలిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యమైన జీవితం కోసం కష్టపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ అసిస్టెంట్ సాయిబాబా, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్‌బాబుకు పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చిలకలూరిపేట అధ్యక్షులుగా డాక్టర్ ముద్దన రమేష్‌బాబు ఎన్నికైన నేపథ్యంలో పట్టణ ప్రముఖులు, నాయకులు ఆయన్ను శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్ కాంపౌండర్, నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, కోశాధికారి అనపర్తి వెంకట్ ఉన్నారు.

రోడ్లపై చెత్తవేస్తే జరిమాన : కమిషనర్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలో కొందరు వ్యాపారులు ఎంత చెప్పిన వినకుండా రోడ్లపై చెత్తను ఇష్టారీతిన వేస్తున్నారని, వారికి జరిమాన విధిస్తామని మున్సిపల్ కమిషనర్ పర్వతినేని శ్రీధర్ అన్నారు. పలు వీధులను శుక్రవారం పరిశృలించిన ఆయన మాట్లాడుతు చెత్తను మున్సిపల్ కార్మికులు వచ్చినప్పుడు వారికి అందించాలని సూచించారు. వ్యాపారులు వారి వ్యాపార సముదాయల ముందు డబ్బాలు ఏర్పాటు చేసుకోని వాటిలో చెత్త వేసుకోవాలన్నారు. కళ్యాణ మండపాల వద్ద వివిధ కార్యక్రమాలు జరిగినప్పుడు అక్కడ డెకరేషన్‌కు వినియోగించే, ఇతర వ్యర్ధాలను మండపాల బయట వేస్తున్నారని, దీనికి మండపాల నిర్వాహకులు బాధ్యత వహించి చెత్తను బయట వేయకుండా చూసుకోవాలని చెప్పారు. తడిచెత్త పొడిచెత్త సేకరణ గురించి వ్యాపారాలకు వివరించాలని కార్మికులకు సూచించారు.

గాంధీ అధ్యయన కేంద్రాన్ని సందర్శించిన మాచిరెడ్డి దంపతులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కడపకు చెందిన అభ్యుదయ రచయితల సంఘం జిల్లా నేత డాక్టర్ మాచిరెడ్డి దంపతులు స్థానిక లింగంగుంట్ల గాంధీ వనంలోని గాంధీ అధ్యయన కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడి గ్రంథాలయంలోని పలు అమెరికా, లండన్ వంటి విదేశాలలో ప్రచురితమైన అరుదైన పుస్తకాలను కొన్ని గంటలపాటు పరిశీలించారు. ఆకాశవాణి కడప కేంద్రం విశ్రాంత సంచాలకులు డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి, కడప ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సంజీవమ్మ ఆయా తెలుగు-ఇంగ్లీష్ పుస్తకాలను ప్రదర్శించారు. ఇతర జిల్లాల గాంధీతత్వ అభిమానులు, ఇతరులు తప్పక ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని గాంధీ మహాత్ముని జీవిత సందేశాలను అధ్యయనం చేయాలని, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గాంధీ స్మారక సమితి అధ్యక్షులు ఇ.గోపీచంద్, నాగశిరో మణి, లక్ష్మి, సుబ్బయ్య, వీరనాగయ్య, సామ్రాజ్యం పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పౌర హక్కుల దినోత్సవాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - అచ్చంపేట

గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని డిబిఆర్‌సి గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ ఎం.చిన్నప్ప, అచ్చంపేట మండల కో-ఆర్డినేటర్ ఎస్.అశోక్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ జి.శ్రీనివాసరావుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఆదేశాల మేరకు తహశీల్దార్ అధ్యక్షతన ప్రతినెలా పౌర హక్కుల దినోత్సవం ఏర్పాటు చేయాలని, మండలంలోని అన్ని శాఖ అధికారులకు షెడ్యూల్ చేసి పంపించాలని, ఆ కమిటీలో స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజా సంఘాలు, ఎన్జీఓలు, దళిత, గిరిజన నాయకులను కలుపుకొని సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, విద్య, ఉపాధి, ఉద్యోగ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

జాబ్ మేళాల్లో 149 మందికి ఉద్యోగాలు

సిఆర్ కాలేజీలో నిర్వహిమచిన మేళాలో నియామక పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నాదెండ్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గణపవరంలోని సిఆర్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. 4 కంపెనీలు ఇంటర్వ్యూలు చేపట్టగా 108 మంది హాజరయ్యారు. వీరిలో 70 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు తెలిపారు. కాలేజీ డైరెక్టర్ చుండి రంగనాయకులు, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య , ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి జెఇఒ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 4 కంపెనీలు నిర్వహించి జాబ్ మేళాకు 101 మంది అభ్యర్థులు హాజరవగా 79 మంది ఎంపికైనట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, కిరణ నాయక్, రామకృష్ణారెడ్డి, మహిధర్, మస్తాన్, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి నాగుల్ పాల్గొన్నారు.

పిడుగురాళ్ల మేళాలో ఉద్యోగాలు పొందిన వారితో నిర్వాహకులు

కళాకారులను సత్కరిస్తున్న మల్లికార్జునరావు

ఆహ్లాదం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - వినుకొండ

కళాసాగరి ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సంయుక్తంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఘంటసాల గానామృతం సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు హాజరయ్యారు. అశ్లీలతకు తావు లేకుండా ఆహ్లాదం కలిగించే విధంగా కార్యక్రమాలు ఉన్నాయని అభినందించారు. అనతరం రోటరీ జిల్లా 31 50 మాజీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగశ్రీను రాయల్, బిజెపి నాయకులు ఎం.రమేష్, ప్రముఖ న్యాయవాది మూర్తి మాట్లాడారు. 'కళాసాగరి ఘంటసాల స్మారక అవార్డు' ను ఒంగోలుకు చెందిన కొమ్ము విజయ్ కుమార్- పూర్ణిమ దంపతులుకు ప్రదానం చేయగా 'కళాసాగరి సేవా ప్రపూర్ణ' అభినందన సత్కారాన్ని పివి.సురేష్‌బాబుకు చేశారు.

యుటిఎఫ్ చిలకలూరిపేట మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని స్థానిక పెన్షనర్స్ హోంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. సమావేశానికి కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించగా నూతన కార్యవర్గంలో మండల గౌరవాధ్యక్షులుగా వి.నాగమల్లేశ్వరరావు, అధ్యక్షులుగా కె.స్నేహలత, ప్రధాన కార్యదర్శిగా షేక్ మొహమ్మద్ యాసీన్, సహాధ్యక్షులుగా ఎన్.ఉమామహేశ్వరరావు, మహిళా సహాధ్యక్షులుగా టి.సునీత, ట్రెజరర్‌గా డి.ఏసన్న నాయక్, జిల్లా కౌన్సిలర్స్‌గా డి.సాంబశివరావు, టి.బాలరాజు, మండల కౌన్సిలర్లుగా కె.శ్రీనివాసరావు, పి.శివపార్వతి, డి.సుజాత, హనుమాన్ నాయక్, సురేష్ కుమార్, శివరావు, ఎస్.నరసింహారావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కౌన్సిలర్ కె.తిరుపతి స్వామి, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహన్‌రావు వ్యవహరించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సిద్ధార్థ ఎంపిడిఒ విజయలక్ష్మి

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగేలా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసు కోవాలని తహశీల్దార్ సిద్ధార్థ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఎలక్షన్ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్నంగి, కొల్లిపర, శివలూరు, వల్లభాపురం, అత్తోట ఆయకట్టు రైతులకు గ్రామ సచివాలయ సిబ్బందికి ఇరిగేషన్ శాఖ పంచా యతీరాజ్ శాఖ సిబ్బందికి, ఆయా గ్రామాల వీఆర్వోలకు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు డిసెంబర్ 5న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవు తుందని డిసెంబర్ 8వ తారీకున ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ ఏర్పాటు

ప్రారంభించిన తెనాలి మున్సిపల్ కమిషనర్

మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణ పేదరిక నిర్మూలన శాఖ ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ ను తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ప్రారంభించారు. మెప్మా సభ్యుల ద్వారా ఇంటివద్ద తయారుచేసిన తినుబండారాలు, వివిధ రకాల చేతి ఉత్పత్తులను ప్రదర్శనద్వారా తిలకించారు. శేషన్న మాట్లాడుతూ మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎన్ తేజ్ భరత్ ఆదేశాలా మేరకు స్వయం సహాయక సంఘ సభ్యులకు మెప్మా ద్వారా లోన్లు మంజూరు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను అర్బన్ మార్కెట్ల ద్వారా విక్రయించి లాభం పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమానికి పాటు పడతామన్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నెలకు రెండు పర్యాయాలు అర్బన్ మార్కెట్ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. మెప్మా సభ్యులు తయారు చేసిన తినుబండారాలను రుచి చూశారు. మెప్మా సిఎంఎం జి విజయ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ సహాయ కమీషనర్ వివిఎన్ లక్ష్మీపతి, మేనేజరు ఆర్ చండి దేవసేన, రెవెన్యూ అధికారి ఎన్ రామప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు ఛైర్‌పర్సన్ శంకుస్థాపన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్లు విస్తరణ పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక 8వ వార్డు లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుండి మేడిశెట్టివారి వీధి వరకు నిర్మిస్తున్న 114 మీటర్లు సిసి రోడ్డుకు రూ. 12.35 లక్షలు వ్యయంతో పనులు ప్రారంభించినట్లు ఛైర్పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరు ఆకుల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీరు సూరిబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి తెనాలి రూరల్

పట్టణానికి చెందిన ప్రముఖులు మొవ్వ సునీల్ ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక సుల్తానాబాద్, జెయంజె కళాశాల వద్ద స్వధార్ హోమ్ లో శుక్రవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కెన్యా నుంచి వచ్చిన సునీల్ కుటుంబ సభ్యులు కొత్తపల్లి కష్ణమోహన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు స్వధార్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరి క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, రోటరి డిస్టిక్ ఇంటర్ క్లబ్ రిలేషన్ జోనల్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణ చంద్, చిగురుపాటి శివప్రసాద్, దాసరి రామకష్ణ, మన్నూరు ప్రసాద్, గోగినేని శివతేజ తదితరులు పాల్గొన్నారు.

7న పిటిఎ సమావేశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సమాజ భాగస్వామ్యం తోడైతేనే ఏ రంగమైన అభివృద్ధి చెందుతుందని మండల విద్యాశాఖ అధికారి-2 వి జయంతి బాబు అన్నారు. పిటిఎ ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై శుక్రవారం కొత్తపేట శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర

డిజిటల్ మానిటరింగ్ ద్వారా వివరాలను తెలుపుతున్న ఎంఇఒ

ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావే శంలో ఆయన పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష, పాఠశాల విద్య సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 7న జరగనున్న ప్రభుత్వ ప్రైమరి, యుపి, ఉన్నత పాఠశాల్లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి టీచర్లు, తల్లితండ్రులు పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల ప్రైమరి, యుపి, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యావనరుల కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొల్లిపర

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మువానిపాలెం తూములూరు సచివాలయాలను, హనుమాన్ పాలెం గ్రామంలోని పంచాయతీ అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్ పరిశీలించి పిల్లల చదువుపై ఆరా తీశారు. హనుమాన్ పాలెం పంచాయతీలోని ఇంటి పన్ను వివరాలను ఆన్లైన్లో త్వరగా నమోదు చేసి నూరు శాతం పన్ను వసూలు చేయా లన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, సచివాలయంలో ప్రజలు సమర్పించిన అప్లికేషన్ను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

షరీఫ్‌కు రాజధాని రైతుల సత్కారం

ప్రజాశక్తి - తుళ్లూరు

వైసిపి ప్రభుత్వ హయాంలో శాసన మండలి చైర్మన్ హోదాలో ఎన్నో అడ్డంకులు వచ్చినా ఎదుర్కొని తమకు అండగా నిలబడ్డారని షరీఫ్ మహమ్మద్ అహ్మద్‌ను రాజధాని రైతులు కొనియాడారు. శుక్రవారం షరీఫ్ ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ స్టేట్ అడ్వైజర్ హోదాలో మొదటిసారిగా ఛాంబర్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రైతులు, మహిళలు శాలువాలతో, రైతు కండువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మూడు రాజధానుల బిల్లు శాసన మండలిలో చర్చకు వచ్చినప్పుడు షరీఫ్ బిల్లును ఆమోదించకుండా సెలెక్ట్ కమిటీకి పంపారు. అప్పుడు ఆయన నిర్ణయానికి రాజధాని గ్రామాల్లో ఆనందంతో రైతులు సంబరాలు చేసుకున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీలో డిసెంబర్ ఒకటిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత హెల్త్ సెంటర్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, రోగులకు ఎయిడ్స్ పై ఎయిమ్స్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ హరిత పవర్ పాయింట్ ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష మాట్లాడుతూ ఈ ఏడాది ఎయిడ్స్ థీమ్ హక్కుల మార్గాన్ని అనుసరించండి, నా ఆరోగ్యం- నా హక్కు నినాదంతో నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శుభమ్, హెల్త్ సెంటర్ సూపర్వైజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : చెడు అలవాట్ల బారిన పడినట్లయితే సమాజంలో గౌరవప్రదంగా గా బ్రతకలేరని స్థానిక పిహెచ్‌సి వైద్యురాలు సి ఇందిర అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాల లోని కొత్త రఘురామయ్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ క్రొత్త గిరిధర్ వైస్ ప్రిన్సిపాల్ టి రాఘవరెడ్డి కాలేజీ సిబ్బంది పై పూర్ణచంద్రరావు బి రాంబాబు ఆరోగ్య సిబ్బంది జానమ్మ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో పిహెచ్‌సి కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెదవడ్లపూడి డీబీఎన్ గార్డెన్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పెదవడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్లకి, హెల్త్ సెంటర్ల సిబ్బందికి మధ్య కుటుంబ వాతావరణం మాదిరిగా ఉంటే హెల్త్ సెంటర్లో పని బాగా జరిగి, రోగులకు మరింత విశిష్ట సేవలందించగలుగుతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ సుబ్బరాయన్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్, డాక్టర్ రమేష్, డాక్టర్ పీ అనూష, డాక్టర్ సతీష్, డాక్టర్ రామానంద్, డాక్టర్ షేక్ ముబీన తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో ఉచితంగా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

విజయవాడ పడమట పివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణాల్లోనే నులకపేట మాత శివ చైతన్య ఆశ్రమంలో శుక్రవారం రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. చైతన్యత పోవన్ అధిపతి మాత శ్రీ శివ చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఫౌండర్, మరియు గౌరవ అధ్యక్షులు వావిలాల రజనీకాంత శర్మ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో ఏకో, ఈసీజీ లాంటి కీలకమైన పరీక్షలు, మెదడు, నరాలు, ఆర్థో, కిడ్నీ, కంటి పరీక్షలు మరియు గైనిక్ పరీక్షలు వైద్యులు నిర్వ హించారని చెప్పారు. రోగులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ శీను చౌదరి, కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగ కిరణ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శైలజ, గైనకాలజిస్ట్ డాక్టర్ సుభద్ర, ల్యాబ్ టెక్నీషియన్ భవాని, ఆరోగ్య సిబ్బంది కావ్య, భవాని, కీర్తన, క్యాంపు సహాయకులు తిరుపతి రావు పాల్గొన్నారు.

వర్సిటీలో మేనేజ్మెంట్ విద్యార్థులకు వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో మేనే జ్మెంట్ కోర్సులు చదువు తున్న విద్యార్థులు లైఫ్ స్కిల్స్‌ను పెంపొందిం చుకో వాలని ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య పి. రఘునాథరెడ్డి సూచించారు. వర్సిటీలోని కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగాలు సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు లైఫ్ స్కిల్స్ పై శుక్రవారం ఒకరోజు వర్క్ షాప్ జరిగింది. ఈ వర్క్ షాప్ కు విభాగాధిపతి ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ మేనేజ్మెంట్ విద్యార్థులకు నెట్వర్క్, కమ్యూనికేషన్ యొక్క ఆవశ్యకత పై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థి వ్యక్తిగత వృతి పరంగా అవి ఎలా ఉపయోగపడతాయో వివరించారు. నెట్వ ర్కని పెంపొందించుకోవడం కోసం సోషల్, ఎమోషనల్ వెర్బల్, నాన్ వెర్బల్, కమ్యూనికేషన్లు చాలా అవసరం అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృతి చేశారు. ఈ వర్క్ షాప్‌లో విభాగం అధ్యాపకులు డాక్టర్ రత్న కిషోర్, డాక్టర్ ప్రసన్న కుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీలో ప్రథమ స్థానంలో గుడ్‌న్యూస్ హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-తాడేపల్లి : 28న గుంటూరు లోటస్ ఆద్య పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి, త్రోబాల్ పోటీల్లోఅండర్ 14 క్యాటగిరి విభాగంలో తాడేపల్లి సుందరినగర్‌లోని గుడ్‌న్యూస్ హైస్కూల్ విద్యార్థి నులు ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జట్టు కెప్టెన్‌గా సింధు, జి హర్షిత, లాస్య, సరి, లికిత, నందిని, మేఘ న , హర్షిత, అక్షయ, ప్రియ, సుజాత లకు ప్రిన్సిపల్ మరియు కరస్పాండెంట్ రేవ... ఫాదర్ ఆరో కియా దాస్, పిడి కే అజయ్ కుమార్, పి ఈ టి కే యశస్విని అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ విద్యార్థులు సమిష్టి కృషి సంకల్పం తోడై ఈ విజయం సాధించినట్లు చెప్పారు. చదువులతో పాటు ఆటలు కూడా ముఖ్యమేనని తెలిపారు.

అమరేశ్వరాలయాన్ని సందర్శించిన మాజీ రాష్ట్రపతి

రామ్‌నాథ్ కోవింద్ దంపతులకు ఘన స్వాగతం పలికిన ఆలయ సిబ్బంది

ప్రజాశక్తి - అమరావతి

సుప్రసిద్ధ శైవ క్షేత్రం, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన, పంచారామాలలో ఒకటైన పల్నాడు జిల్లాలోని అమరేశ్వరాలయాన్ని భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులతో శుక్రవారం సందర్శించారు. మాజీ రాష్ట్ర పతి కోవింద్ దంపతులు, కుటుంబ సభ్యులకు వేదపండితులు ముందుగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మాజీ రాష్ట్ర పతి రాక సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహంచారు. కార్యక్రమంలో ఐజి సర్వ శ్రేష్ట త్రిపాటి, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసులు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి కోట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కోవింద్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని ఇచ్చి సత్కరించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపల్ తదితరులు

ఎన్‌పిటిఇఎల్ ఫలితాల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజి బి.టెక్ విద్యార్థులు మద్రాసు ఐఐటి వారు నిర్వహించిన నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హ్యాన్స్‌డ్ లెర్నింగ్ ఫలితాల్లో క్లౌడ్ కంప్యూటింగ్ రంగంలో టి.శివపవన్ మొదటి ర్యాంకు జాబితాలో కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ సందర్భంగా శివపవన్‌ను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ అభినందించి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో లాం చలపతి కళాశాల మొదటి స్థానంలో ఉందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని, ఈ సర్టిఫికెట్ కోర్సులు భవిష్యత్‌లో మంచి ఉద్యోగాల సాధనకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం శివపవన్‌ను నగదు, ప్రశంసాపత్రంతో అందించి అభినందించారు. అలాగే ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, ఎన్‌పిటిఇఎల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వి.నరేంద్ర విద్యార్థులను అభినందించారు.

విజేతలకు బహుమతులు అందచేస్తున్న మన్నవ రాధాకృష్ణమూర్తి, తదితరులు

జాతి గౌరవం, కీర్తిని పెంచేందుకు క్రీడలు దోహదం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ దేశాలలో భారత జాతికి గొప్ప బలాన్ని, గౌరవాన్ని, కీర్తిని ఆర్జించి పెట్టేవి క్రీడలేనని, విద్యార్థి దశలో క్రీడల పట్ల ఆసక్తి కనబర్చడం ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసం కలుగుతాయని బాలానంద కేంద్రం అధ్యక్షులు డాక్టర్ మన్నవ రాధాకష్ణమూర్తి అన్నారు. స్థానిక కష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాలలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పాఠశాల విద్యార్థుల అండర్ 14, 16 జిల్లాస్థాయి త్రోబాల్, కబడ్డీ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రాధాకష్ణమూర్తి పాల్గొని ప్రసంగించారు. పోటీలలో జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలల నుండి జట్లు పాల్గొనగా కబడ్డీ అండర్ 14 విభాగంలో పిడుగురాళ్ల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విన్నర్స్, లోటస్ ఆద్య రన్నర్స్, అండర్ 16 విబాగంలో పిడుగురాళ్ల స్కాలర్స్ స్కూల్ విన్నర్స్ గా, నరసరావుపేట సింధు రన్నర్స్ గా నిలిచారు. త్రో బాల్ అండర్ 14 తాడేపల్లి గుడ్ న్యూస్ స్కూల్ విన్నర్‌గా, లోటస్ ఆద్య రన్నర్స్‌గా, అండర్ 16 విన్నర్స్, రన్నర్స్‌గా సెయింట్ జోసెఫ్ పాఠశాల సర్టిఫికెట్స్ ట్రోఫీలు అందుకున్నారు.కార్యక్రమంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు జివి శివప్రసాద్, బాలానంద కేంద్రం కోశాధికారి జి సంధ్యశ్రీ, లోటస్ ఆధ్యా విద్యా సంస్థల డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ఎకడమిక్ డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి, ప్రిన్సిపల్ వేణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటు దరఖాస్తులను గడువులోగా ఆమోదించాలి

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి సింగల్ విండో ద్వారా అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత గడువులోగా అనుమతులు మంజూరు చేసేలా పరిశ్రమల శాఖ అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం, జిల్లా క్రైసిస్ గ్రూప్ (డీసీజీ) సమావేశం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. డీఐఈపీసీ సమావేశం అజెండా అంశాలపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన వివిధ శాఖల అనుమతులు మంజూరుకు సమన్వయంతో చర్యలు తీసుకొని నివేదిక అందించాలన్నారు. ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ప్రోగ్రాం 2024-25 క్రింద రుణాలు మంజూరు చేసిన ఎంఎస్‌ఎం ఇలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల న్నారు. జిల్లాలో వివిధ పరిశ్రమల రాయితీలకు సంబంధించి 16 క్లైయిమ్స్ కు రూ.1,11, 62,027లు మంజూరు చేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదించారు. పియం విశ్వకర్మ ట్రైనింగ్ కు 2740 మంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు. క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంకు అవసరమైన అన్ని చర్యలు, అన్ని శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఇ సర్వే నిర్దేశిత సమయంలో పూర్తిచేసేలా సంబంధిత శాఖలు నిరంతరం పర్య వేక్షిస్తూ ప్రణాళికా ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. ఈసమావేశంలో కమర్షియ ల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ బి.హిజ్జా మనో రమ, ఏపీ ఎస్ఎఫ్‌సి మేనేజర్ అజిత, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (ఎఫ్ఏసి) టి.రాజు, ఏపిపిబి ఈఈ ఎండి నజీనా బేగం , జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ జయలక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో రూ.60 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర నాయుడు

గుంటూరు నగరంలో సుమారు రూ.60 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులు నిర్వహించటానికి జిఎంసి స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. స్థాయి సంఘం అధ్యక్షులు, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అధ్యక్షతన శుక్రవారం మేయర్ ఛాంబర్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి స్థాయి సంఘ సమావేశం నిర్వహి ంచారు. సమావేశంలో నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన 230 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను స్థాయి సంఘ సభ్యులు, నగర పాలక సంస్థ విభాగాధీపతులతో చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డుల వారీగా జరిగే అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ ప్రకారం స్థానిక కార్పోరేటర్లకు ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలన్నారు. గుంటూరు నగరంలో కులమత, పార్టీలకు అతీతంగా ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో లీజులు పూర్తైన షాపులకు నిబంధనల మేరకు లీజు రెన్యువల్ చేశామన్నారు. నగరంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజాసమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సి.సి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామన్నారు. విలీన గ్రామాల్లో కూడా నూతనంగా సిసి డ్రైన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామన్నారు. సదరు సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు సంకురి శ్రీనివాసరావు, షేక్ మహమూద్, కాంద్రుకుంట గురవయ్య, మల్లెబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేద్కర్, శ్యామల వెంకటరమణా దేవి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులకు ప్రశంసలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ (విజయవాడ)

హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పి.రమేష్ బాబు

అంతర్జాతీయ వైద్య సదస్సులో ప్రశంసలందుకున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులను అభినందిస్తున్న ఎమ్‌డి డాక్టర్ పి.రమేష్‌బాబు

ఇటీవల లండన్‌లో జరిగిన పిసిఆర్ లండన్ వాల్వ్ అంతర్జాతీయ వైద్య సదస్సులో తమ వైద్యులకు గౌరవం దక్కిందని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమేష్‌బాబు తెలిపారు. విజయవాడ లోని రమేష్ హాస్పిటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసినా మీడియా సమావేశంలో డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాన్స్ కేథటర్ వాల్వ్ రీప్లేస్మెంట్ విధానంలో గుండె కవాటాలను మార్చవచ్చని తెలిపారు. ఈ మినిమల్ ఇన్వెజివ్ ప్రక్రియతో తక్కువ రిస్క్‌తో వేగంగా కోలుకోవడం సాధ్యమవుతుందన్నారు. ఈనెల 26న లండన్‌లో జరిగిన అంతర్జాతీయ వైద్య సదస్సులో రమేష్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజా రమేష్ పాల్గొని తీవ్ర లెఫ్ట్ వెంట్రికలర్ డిస్ ఫంక్షనల్ ఉన్న రోగికి అయోటిక్ కవాట మార్పిడిని విజయవంతంగా నిర్వహించిన విధానాన్ని వివరించి సదస్సుకు హాజరైన సభ్యుల నుండి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా టావి, మెట్ర క్లిప్ చికిత్సలను తమ హాస్పిటల్ విజయవంతంగా నిర్వహించిందని పేర్కొ న్నారు. ఇప్పటివరకు 30 మందికిపైగా రోగులకు అయోటిక్ లేదా మైట్రల్ కవాటాలను శస్త్ర చికిత్స అవసరం లేకుండా ట్రాన్స్ క్యాథటర్ వాల్వ్ రీప్లేస్మెంట్ విధానంలో విజయవంతంగా మార్పు చేసినట్లు తెలిపారు. తద్వారా తమ హాస్పిటల్ అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. అత్యుత్తమ అధునాతన గుండె వైద్య సేవలను అందించడంలో రమేష్ హాస్పిటల్ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ ప్రగతిలో తమ హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ వైద్య బృందం కీలకపాత్ర పోషించిందన్నారు. ఆ బృందం నైపుణ్యం, కృషితోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. ఆ సందర్భంగా హాస్పిటల్ వైద్య బృందాన్ని డాక్టర్ రమేష్‌బాబు అభినందించారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ భాస్కర్ నాయుడు, డాక్టర్ జి.కృష్ణమోహన్, డాక్టర్ సోమనాథ్, డాక్టర్ రామ మనోహర్, డాక్టర్ మధు కృష్ణ, డాక్టర్ చంద్ర మౌళి, డాక్టర్ షాహనాజ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు పాల్గొన్నారు.